## మినీ కథలు :

# ఎథీస్ట్




అ.వం.రాఘవరావు

రాత్రి తొమ్మిది గంటలైంది. హైదరాబాదు పోయే బస్సు గుంటూరు బస్సుస్టాండులో ఆగింది.

అదే బస్సులో మిత్రులు రామారావుగారుకూడా ఎక్కారు. ఇద్దరం మాటల్లోపడి బస్సు ఎప్పుడు కదిలిందోకూడా గమనించ లేదు.

రామారావుగారు హైదరాబాదులో ప్రభుత్వ శాఖాధిపతిగా పని చేస్తున్నారు. రెండు రోజుల సెలవు మీద గుంటూరు వచ్చి, అమ్మాయితో తిరిగి హైదరాబాదు పోతున్నారట.

"ఏమండీ, డాక్టరుగారూ, మీ అబ్బాయి బాగున్నాడా? ఏం చేస్తున్నాడిప్పుడు?" రామారావుగారు ప్రశ్నించారు.

గతం కెలికినట్లై కళ్ళనీళ్ళు తిరిగినై. ఏమని జవాబు చెప్తాను ఇరవై అయిదు సంవత్సరాలు ఎదిగిన ఒకే ఒక్క కొడుకు M. Sc. ప్యాసై, Ph. D. చేస్తూ మూడు నెలల క్రితం హఠాత్తుగా పోయాడంటే ఏ తండ్రికి మనశ్శాంతి వుంటుంది.

బరువెక్కిన గొంతుతో అంతా వివరించాను. "ఏదోలెండి. చేసుకొన్నవారికి చేసుకొన్నంత. క్రిందటి జన్మలో ఏం పాపం చేశామో .... భగవంతుడు ఈ జన్మలో ఈ కడుపుకోత శిక్ష విధించాడు! అయినా - మన చేతిలో ఏముంది. క్షణం తర్వాత జరగబోయేది తెలియదు!"

"ఈ శుష్కవేదాంతాలకేంలెండి. దేవుడు, దయ్యం, కర్మ పాపం .... యిటువంటి మాటలన్నీ చెప్పి అందరూ ఎస్కేపిస్టులవుతున్నారు. ఇవన్నీ మరచిపోయి హాయిగా ఒక నెల రోజుల పాటు దేశమంతా తిరిగిరండి. మనస్సు శాంతిస్తుంది. మన కర్మ మనం చేసే పనులవల్లనే జరుగుతుంది. మంచైనా, చెడైనా మనకు తెలీకుండా ఏమీ జరగదు. వాటికి దేవుడు, దయ్యమని ఆపాదించడం అనవసరం. ఉపన్యాస ధోరణిలో వుంది రామారావుగారి కంఠం.

వారి చేతిలో "We become aethiests" అనే కీర్తిశేషులు శ్రీ గోరాగారి ఆత్మకథ పుస్తకం చూచిన తర్వాత కూడా వారితో ఆ విధంగా మాట్లాడినందుకు చింతించిన మాట వాస్తవం.

బస్సులో లైట్లు ఆర్పివేశాడు డ్రైవరు. నంబూరు దగ్గరగా వచ్చినట్లున్నాము. అప్రయత్నంగా కళ్ళు మూతలుపడినయి.

తెల్లవారు ఝామున నాలుగు గంటల ముప్పై నిముషములకు మెలకువ వచ్చింది. బస్సు దాదాపు దిల్‌సుక్‌నగర్ బస్సు డిపో దగ్గర వున్నది.

మలక్‌పేట సూపర్ బజార్ దగ్గరగా కొద్దిసేపు ఆపితే దిగి పోతామని డ్రైవరును అడుగుతున్నారు రామారావుగారు. అక్కడ స్టేజి లేదని, ఎక్కడపడితే అక్కడ ఆపితే తనకు ఉద్యోగ రీత్యా మాటవస్తుందని, సైదాబాదు చౌరస్తా దగ్గర దిగి పొమ్మని చెప్తున్నాడు డ్రైవరు.

"అక్కడ దిగితే మళ్ళీ రెండు మైళ్లు వెనక్కు రావాలి. ఈ టైములో ఆటోలుకూడా వుంటాయో, వుండవో. ఒక్క నిముషం ఆపితే దిగిపోతాం. ఎవరైనా బస్సులో వాళ్ళు రిపోర్టిస్తేగదా నీకు మాట వచ్చేది. అట్లా వచ్చే పక్షంలో నీకు ఏమీ కాకుండా నేను చూస్తాగా" అధికార కంఠంతో మాటాడారు రామారావుగారు.

"పోనీ, డ్రైవరుగారూ, పెద్దవారు అంతగా అడుగుతున్నారుగా ఒక్క నిమిషం ఆపండి. మళ్ళీ ఆడపిల్లతో వారు అంత దూరంనుంచి వెనక్కెక్కడ వస్తారు" నేనూ రెండు ముక్కలు చెప్పాను.

ప్రయాణీకులలో యింకా ఒకరిద్దరు అదేవిధంగా అడగటంతో మలక్‌పేట దగ్గర బస్సునాపాడు. వీధి దీపాలు వెలగడంలేదు. దీపావళి పోయి రెండు రోజులే గనుక వెన్నెల లేదు. చీకటిగా వుంది. "మళ్ళీ కలుసుకుందామండీ డాక్టరు గారూ" అని చెప్పి వాళ్ళ అమ్మాయితో దిగిపోయారు రామారావుగారు.

* * *

బస్సు సైదాబాదు చౌరస్తా దగ్గర ఆగింది. నేను కూడా సర్దుకొని దిగాను. అక్కడ వీధి దీపాలు వెలుగుతున్నాయి. దగ్గరలో ఆటో లెక్కడాలేవు. రిక్షా బేరమాడుతున్నాను. పది నిమిషాలు గడిచినయి.

వెనుకనుంచి ఆటో వస్తున్నది. నా దగ్గరకే వచ్చి ఆగింది. ఆటోలోనుంచి సన్నగా ఏడ్పు విన్పిస్తున్నది.

"డాక్టరుగారూ" ఏడ్పుస్వరం పిల్చినట్లైంది.

ఇంటికి చేరకముందే అప్పుడే ఎవరికి తెలిసిందబ్బా నేను వచ్చానని.

ఆటోలోనుంచి దిగిన మనిషిని చూసి నిర్ఘాంతపోయాను. రామారావుగారి అమ్మాయి.